క్లుప్తంగా

క్రీడా పాఠశాలల్లో ప్రవేశాలకు ఆహ్వానం

ఐనవోలు : రాష్ట్ర ప్రభుత్వ క్రీడా పాఠశాలల్లో 2025–2026 విద్యా సంవత్సరానికి గాను నాల్గోవ తరగతిలో ప్రవేశాలు పొందేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు మండల విద్యాశాఖ అధికారి పులి ఆనందం తెలిపారు. బుధవారం మండల విద్యా వనరుల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. హకీంపేట్, కరీంనగర్, ఆదిలాబాద్‌లో క్రీడా పాఠశాలలు ఉన్నాయన్నారు. అందులో నాల్గోవ తరగతి ప్రవేశానికి విద్యార్థుల ఎంపికకు సంబంధిత వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని తెలిపారు. మండలంలోని అన్ని పాఠశాలల్లో 3వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు 01.09.2016 నుంచి 31.08.2017 నడుమ జన్మించిన వారు అర్హులన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న విద్యార్థులు, ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోలేని వారు కూడా ఈనెల 19న మండల స్థాయిలో ఎంపికకు మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఉదయం 9 గంటలకు హాజరు కావాలని సూచించారు. స్టడీ సర్టిఫికేట్, ఆధార్ కార్డు, 3 పాస్‌ఫోర్టుసైజ్ ఫొటోలు, పుట్టిన తేదీ సర్టిఫికేట్ వెంట తీసుకురావాలని పేర్కొన్నారు. వివరాలకు ఫిజికల్ డైరెక్టర్లు కైలాష్ 99668 67149, కిషన్ 96039 09729 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని కోరారు. సన్నాహక సమావేశంలో పీఈటీలు హరి, కిషన్, కైలాష్, కిరణ్ పాల్గొన్నారు.

నడికూడ : మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో గురువారం స్పోర్ట్స్ స్కూల్ సెలక్షన్స్ జరుగుతాయని ఎంఈఓ హనుమంతరావు, వ్యాయామ ఉపాధ్యాయుడు సుభాష్ తెలిపారు. ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలలో 3వ తరగతి పూర్తిచేసి 4వ తరగతి చదువుకునే 01.09.2016 నుంచి 31.08.2017 మధ్య జన్మించిన విద్యార్థులు అర్హులని తెలిపారు. వివరాలకోసం పీడీ శివకుమార్ 8106548121 నంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

పరకాల : 2025–26 విద్యా సంవత్సరానికి గాను క్రీడా పాఠశాలల్లో 4వ తరగతి ప్రవేశానికి గురువారం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో విద్యార్థుల ఎంపిక జరుగనుందని ఎంఈఓ రమాదేవి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2026 సెప్టెంబర్ 1 నుంచి 2017 ఆగష్టు 31 (8 నుంచి 9 సంవత్సరాల వయస్సు)లో జన్మించినవారు అర్హులని తెలిపారు. ఫిజికల్ పరీక్షలు తరువాత 4వ తరగతి ప్రవేశానికి మండలస్థాయి నుంచి ఎంపిక చేయడం జరుగుతుందని ఆమె తెలిపారు.

ముగిసిన రెవెన్యూ సదస్సులు

ఎల్కతుర్తి : భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిన భూ భారతి చట్టంలో భాగంగా చేపట్టిన రెవెన్యూ సదస్సులు భీమదేవపల్లి మండలంలో బుధవారంతో ముగిసినట్లు తహసీల్దార్ రాజేష్ తెలిపారు. మండలంలోని రత్నగిరి గ్రామంలో 53 దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. మండల వ్యాప్తంగా మొత్తం 1351 దరఖాస్తులు వచ్చినట్లు పేర్కొన్నారు. నయాబ్ తహసీల్దార్ సూర్య, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్, విజయ్, భాస్కర్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మకూరు : మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన భూ భారతి సదస్సులో బ్రాహ్మణపల్లి శివారు రైతుల నుంచి 44 దరఖాస్తులు స్వీకరించినట్లు తహసీల్దార్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. దరఖాస్తులను పరిశీలించి విచారణ చేపట్టి రైతుల సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు.

జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్య అందించాలి

శాయంపేట : ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఉన్న పత్రికా, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఉచిత విద్య అందించాలని బహుజన స్టూడెంట్స్ యూనియన్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు మంద సురేష్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. ఎన్ని ప్రభుత్వాలు మారినా జర్నలిస్టులకు ఇచ్చిన హామీలు నెరవేరడం లేదని అన్నారు.

రైలుకింద పడి వ్యక్తి ఆత్మహత్య

కాజీపేట రూరల్: కాజీపేట జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అయోధ్యపురం రైల్వే గేట్ సమీపంలో ఓ వ్యక్తి రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు జీఆర్పీ పోలీసులు తెలిపారు. కాజీపేట జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ రమణరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ఐనవోలు మండలం కనపర్తి గ్రామానికి చెందిన నాతి సాయికుమార్ (29)కు ఐదేళ్ల క్రితం వివాహం అయింది. సంతానం కలగక మనోవేదనకు గురై జీవితంపై విరక్తి చెంది రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎంజీఎం ఆస్పత్రి మార్చురీలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించినట్లు హెడ్ కానిస్టేబుల్ వివరించారు.

యోగాతో ఆరోగ్యం

పరకాల : యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని పరకాల యునాని ఆస్పత్రి ఆయుష్ విభాగం యోగా ఇన్‌స్ట్రక్టర్ భోగ రఘుపతి అన్నారు. అంతర్జాతీయ యోగా దశాబ్ది ఉత్సవాల సందర్భంగా శుక్రవారం సోషల్ వెల్ఫేర్ బాలుర హాస్టల్‌లోని విద్యార్థులకు, ఉపాధ్యాయులకు యోగాపై అవగాహన కల్పించారు. 21వ తేదీన యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు.

‘ఇందిరమ్మ ఇల్లు’ కట్టుకోవాలా వద్దా..?

- ప్రభుత్వ నిబంధనలతో సంకోచిస్తున్న లబ్ధిదారులు
- ముగ్గు పోసి వేచిచూస్తున్న కొందరు
- ప్రొసీడింగ్స్ రాక మరికొందరి ఎదురుచూపు



కొండపర్తిలో ఇంటి నిర్మాణానికి ముగ్గుపోసి పనులు ప్రారంభిస్తున్న ఎంపీడీఓ రఘుపతిరెడ్డి (ఫైల్)

ఐనవోలు : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం మండలంలో అంతంతమాత్రమే కొనసాగుతోందని ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. మండలానికి 475 ఇళ్లు మంజూరు చేయాల్సి ఉండగా వివిధ కారణాలతో జూన్ 3న అప్పటి కలెక్టర్ ప్రావీణ్య, ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు 336 ఇళ్లు మంజూరు చేస్తూ లబ్ధిదారులకు ప్రొసీడింగ్ కాపీలు అందించారు. రెండు రోజుల్లో ముగ్గులు పోసుకుని ఆయా గ్రామ పంచాయతీల్లో ఇంటి పనులు ప్రారంభించుకోవాలని జిల్లా కలెక్టర్ స్వయంగా సూచించారు. కానీ పది రోజులు దాటుతున్నా ఇప్పటి వరకు కేవలం 209 మంది మాత్రమే ముగ్గులు పోసుకుని ఇంటి పనులు ప్రారంభించుకునేందుకు సిద్ధమవుతుండడంతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల్లో ఆలస్యం తప్పడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

ప్రభుత్వ నిబంధనలతో ఇబ్బందులు

ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకు ప్రభుత్వ నిబంధనలు కొంత తలనొప్పులు తెచ్చిపెడుతున్నాయనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఇంటి నిర్మాణం 400 నుంచి 600 చదరపు అడుగులు (45కు తగ్గకుండా 66 గజాలకు) మించకుండా నిర్మించుకోవాలి. ఇందులో ఒక హాలు, కిచెన్, బెడ్రూం, వాష్‌రూం, తప్పని సరిగా ఉండాలి. అంతకు మించిన వైశాల్యంలో ఇల్లు నిర్మించుకుంటే మాత్రం నిబంధనల ప్రకారం అనర్హులు అవుతారని అధికారులు ముందుగానే హెచ్చరిస్తుండడంతో కొందరు లబ్ధిదారులు ఇంటి నిర్మాణానికి వెనుకడుగు వేస్తున్నారని సమాచారం. ఆ విస్తీర్ణం చాలనుకునే వారు మాత్రం పనులు ప్రారంభిస్తున్నారు. గుడిసెలు తొలగించి ఆగమేఘాలపై ఇళ్ల నిర్మాణానికి ముగ్గు పోసుకుంటే వర్షాకాలంలో తల దాచుకునేదెలా అంటూ మరికొందరు ఆలోచన పడినట్లు తెలుస్తోంది. అయితే మరికొందరు అప్పోసప్పో చేసి ఇల్లు కట్టుకున్న తర్వాత నిబంధనల పేరిట రిజెక్ట్ చేస్తే ఎలా అని మరికొందరు సంకోచిస్తున్నారు. ఇళ్లు నిర్మించుకునేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ మంజూరీ పత్రాలు రాలేదని ఇంకొందరు ఎదురుచూస్తున్నారు. దీంతో మండలంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. కాగా వివిధ కారణాలతో మంజూరు పత్రాలు పొందలేని లబ్ధిదారులకు త్వరలోనే అందజేస్తామని, 100 శాతం గ్రౌండింగ్ చేసేలా చర్యలు తీసుకుంటున్నామని అధికారులు చెబుతున్నారు. ఇంటి నిర్మాణ వైశాల్య విషయంలో ప్రభుత్వం మరోసారి పునరాలోచించాలని, ఎలా కట్టుకున్నా రూ.5 లక్షలు ఇచ్చేలా నిబంధనలు సడలించాలని పలువురు అభిప్రాయపడుతున్నారు.

నిబంధనలు తొలగించాలి



400 చదరపు అడుగులకు తగ్గకుండా 600 మించకుండా అంటే 45 నుంచి 66 గజాల లోపు ఇల్లు కట్టుకోవాలని ప్రభుత్వం నిబంధన పెట్టడం సరికాదు. పేదవాడు తన ఇష్టపూర్తిగా ఇల్లు కట్టుకోవాలి. కాని అందులో ప్రభుత్వ జోక్యం ఉండకూడదు. సామాన్యులను ఇబ్బందులకు గురిచేసే ఇలాంటి నిబంధనలను ప్రభుత్వం తొలగించాలి. ఇల్లు ఎన్ని చదరపు అడుగుల్లో కట్టుకున్నా రూ. 5లక్షలు అందేలా చర్యలు తీసుకోవాలి. అర్హులందరికీ న్యాయం చేయాలి.

– రాజు, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి

జానపద కళలను కాపాడుకుందాం

- ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్



మాట్లాడుతున్న శ్రీనివాస్‌గౌడ్

పరకాల : ఎన్నో ఏళ్ల చరిత్ర కలిగిన జానపద కళలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జానపద కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వంగ శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. పట్టణంలోని ఎఫ్‌జే గార్డెన్‌లో శుక్రవారం వరంగల్ ఉమ్మడి జిల్లాలోని వరంగల్, హనుమకొండ, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల జానపద కళాకారుల సంఘం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడారు. పల్లెల్లో ఆటాపాటలకు వీడదీయలేని బంధం ఉందని, ఇక్కడి కళలు, ప్రజా కళలు, పాటలు, గేయాలు, కథలు అనేక కళారూపాల్లో వైభవాలు పల్లె ప్రజల నాలుకపై నాట్యమాడుతాయని అన్నారు. ప్రజల కళారుచికి చక్కని నిదర్శనమైన జానపద కళలు కాపాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జానపద కళాకారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి తాళ్ల రమేశ్, రాష్ట్ర మహిళ అధ్యక్షురాలు విజయశ్రీ, ప్రధాన కార్యదర్శి కవిత, భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు నిమ్మల రాజు, సీనియర్ కళాకారులు దయాకర్, పూర్ణయ్య, బండి సమ్మయ్య, శ్రీనివాస్, గట్టయ్య, ధర్మారెడ్డి పాల్గొన్నారు.

సూర్య మార్ట్‌లో టాస్క్‌ఫోర్స్ తనిఖీలు



కాలంచెల్లిన కూల్‌డ్రింక్స్, అంబర్ ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు, అధికారులు

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలం కొత్తకొండలో గల సూర్యమార్ట్‌లో బుధవారం టాస్క్‌ఫోర్స్, స్థానిక పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో రూ.12వేలు విలువచేసే కూల్‌డ్రింక్స్ బిస్కెట్లు, అంబర్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని కొత్తకొండ అనిల్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ముల్కనూరు ఎస్సై సాయిబాబు తెలిపారు. వీటి విలువ సుమారు రూ.22 వేలు ఉంటుందని తెలిపారు. ఎస్సై మాట్లాడుతూ.. కాలంచెల్లిన శీతలపానీయాలు, అంబర్ ప్యాకెట్లు విక్రయించి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేదిలేదని, చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. దాడుల్లో సిబ్బంది పాల్గొన్నారు.

విద్యాశాఖ మంత్రిని వెంటనే నియమించాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కల్యాణ్



మాట్లాడుతున్న కల్యాణ్

పరకాల : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావస్తున్నా విద్యాశాఖ మంత్రిని నియమించకపోవడంతో విద్యారంగ వ్యవస్థ గాడి తప్పుతోందని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బొచ్చు కల్యాణ్ ఆందోళన వ్యక్తం చేశారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన ఎస్ఎఫ్ఐ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యాశాఖ మంత్రి లేకపోవడంతో ప్రభుత్వ పాఠశాలలో మౌళిక సదుపాయాలను పట్టించుకునే నాథుడే కరువయ్యారని ఆరోపించారు. ప్రైవేటు విద్యాసంస్థల్లో అధిక ఫీజులను నియంత్రించకపోవడం, రాష్ట్ర వ్యాప్తంగా రూ.8వేల కోట్ల స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్స్ చెల్లింపులు చేయకపోవడంతో విద్యార్థుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే విద్యాశాఖ మంత్రిని నియమించి విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని, లేని పక్షంలో ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. మండల అధ్యక్షుడు ప్రశాంత్, పట్టణ అధ్యక్షుడు ఈశ్వర్, రవళి, ప్రవళిక, సుజాత, మౌనిక పాల్గొన్నారు.

బీజేపీని బలోపేతం చేయాలి

హసన్‌పర్తి: బూత్ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, స్థానిక కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్ పిలుపునిచ్చారు. పార్టీ ఆధ్వర్యంలో బుధవారం సంకల్పసభ నిర్వహించారు.

సంక్షిప్తంగా

రేషన్ బియ్యం పట్టివేత

వేలేరు : మండలంలోని పీచర గ్రామంలో ఓ వ్యక్తి ఇంట్లో అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని (సన్నబియ్యం) పట్టుకున్నట్లు ఎస్సై అజ్మీర సురేశ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... పీచర గ్రామానికి చెందిన రాగి సంతోశ్ చుట్టుపక్కల గ్రామాల ప్రజల నుంచి రేషన్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి తన ఇంట్లో అక్రమంగా నిల్వ చేసుకున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో పీచర గ్రామంలో పెట్రోలింగ్‌కు వెళ్లిన పోలీసులకు సమాచారం వచ్చినట్లు తెలిపారు. దీంతో దాడులు నిర్వహించగా 7క్వింటాళ్ల 50 కిలోల బియ్యం లభించినట్లు తెలిపారు. వీటి విలువ సుమారు రూ.37,500 ఉంటుందని పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బస్సు సౌకర్యం కల్పించాలని వినతి

శాయంపేట : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు రవాణా సౌకర్యం కోసం బస్సు సౌకర్యం కల్పించాలని కళాశాల ప్రిన్సిపాల్ కందకట్ల కోటేష్ కోరారు. ఈ మేరకు బుధవారం పరకాల డిపో మేనేజర్ రవిచందర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. శాయంపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వచ్చే విద్యార్థుల రవాణా సౌకర్యం కోసం ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. పరకాల నుంచి వాగు అవతలి గ్రామాలకు ఉదయం, సాయంత్రం బస్సు సౌకర్యం కల్పిస్తే వాగు అవతలి గ్రామాల్లో ఉండే నిరుపేద విద్యార్థులు శాయంపేట మండల కేంద్రంలోని కళాశాలలో విద్యను అభ్యసించేందుకు వచ్చే అవకాశం ఉందని తెలిపారు.

ఎమ్మార్పీఎస్ పోరాటానికి మద్దతివ్వాలి

ఐనవోలు : ఎమ్మార్పీఎస్ పోరాటానికి ప్రజలు మద్దతివ్వాలని ఎమ్మార్పీఎస్ నాయకుడు బొక్కల నారాయణ కోరారు. మండలంలోని ఉడుతగూడెం గ్రామంలో బుధవారం ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ, ఎంఎస్ఎఫ్ అనుబంధ సంఘాల నూతన కమిటీ ఏర్పాటు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో యువత సమావేశం ఉన్నత పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు బాబు, చింత అశోక్, బరిగల ఏలియా, గద్దల యాదగిరి, తాటికాయల శ్రీను, అనిల్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ




నోట్‌బుక్స్ పంపిణీ చేస్తున్న ఎంఈఓ భిక్షపతి

పరకాల : పట్టణంలోని సీఎస్ఐ మిషన్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మాజీ కౌన్సిలర్ మడికొండ సంపత్ పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. నిరుపేద కుటుంబాలకు చెందిన తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి ఆర్థిక ఇబ్బందులను తగ్గించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు రవీందర్, ఫయాజోద్దీన్ పాల్గొన్నారు.

శాయంపేట : మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బుధవారం ఎంఈఓ భిక్షపతి నోట్‌బుక్స్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రతిరోజు తప్పనిసరిగా పాఠశాలకు హాజరు కావాలని సూచించారు. ప్రతి పాఠశాలకు గ్రీన్‌బోర్డ్స్ పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చల్లా అశోక్‌రెడ్డి, ఉపాధ్యాయులు మేడిపల్లి సురేందర్, స్వప్న, రాణి పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన అసోసియేషన్ సభ్యులు



నడికూడ : కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన స్నేహ శబరీష్‌ని బుధవారం తెలంగాణ ఎంప్లాయీస్ అసోసియేషన్ సభ్యులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా అధ్యక్షుడు బొట్ల రమేశ్, ప్రధాన కార్యదర్శి గోవిందు నవీన్‌కుమార్, మున్సిపల్ జేసీ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజారపు భాస్కర్, బొక్క ఏలియా, వెంకటస్వామి కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

ఇందిరమ్మ ఇళ్లకు కేంద్రం నిధులు

ఆత్మకూరు : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు కేంద్ర ప్రభుత్వం నిధులు ఇస్తుందని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ముత్యాల శ్రీనివాస్ తెలిపారు. కేవలం రాష్ట్ర ప్రభుత్వం మాత్రమే నిధులు ఇస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ ఆర్భాటాలు చేయడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. పీఎంఏవై పథకంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందని, ప్రజలు గమనించాలని కోరారు. పరకాల నియోజకవర్గంలో అర్హులను తొలగించి అనర్హులను జాబితాలో చేరుస్తున్నారని ఆరోపించారు. ఉన్నతాధికారులు విచారణ చేపట్టి అర్హులకు న్యాయం చేయాలని కోరారు.

అర్హులందరికీ రైతుభరోసా

శాయంపేట : అర్హులైన రైతుల బ్యాంక్ ఖాతాలో రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా నిధులు జమ చేస్తోందని ఏఓ గంగాజమున బుధవారం ప్రకటనలో తెలిపారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, నాలుగు ఎకరాల వరకు రైతు భరోసా నిధులు రైతుల ఖాతాల్లో జమ అయినట్లు తెలిపారు. ఐదారు రోజుల్లో మిగతా రైతులందరికీ జమ అవుతాయని పేర్కొన్నారు.

రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోవాలి

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలంలోని నూతనంగా పట్టాపాస్‌బుక్కు పొందిన రైతులు రాష్ట్ర ప్రభుత్వం అందించే రైతు భరోసా పొందేందుకు ఈనెల 20వ తేదీలోపు దరఖాస్తులు సమర్పించాలని ఏఓ పద్మ బుధవారం ప్రకటనలో తెలిపారు. ఆధార్‌కార్డు, పట్టాపాస్‌బుక్, బ్యాంక్ పాస్‌బుక్, జిరాక్స్ కాపీలను వ్యవసాయ విస్తరణ అధికారికి అందించాని సూచించారు. కేంద్ర ప్రభుత్వం అందించే పీఎం కిసాన్ కోసం ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. ఆధార్ కార్డు, పట్టాపాస్‌బుక్కుతో ఏఈఓను సంప్రదించాలని సూచించారు.

నాసిరకం విత్తనాల రవాణాను అడ్డుకోవాలి

ఎల్కతుర్తి : మండలంలో నాసిరకం విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల రవాణా జరుగకుండా అధికారులు చర్య చేపట్టాలని తెలంగాణ రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాములు కోరారు. మండలంలో నాసిరకం విత్తనాల రవాణా జరుగకుండా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.

రైతుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

- ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే శ్రీహరి



డీసీసీ బ్యాంక్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, ఎంపీ

ధర్మసాగర్ : రైతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, ఒక్క ఆర్థిక సంవత్సరంలోనే వ్యవసాయ రంగానికి 30వేల కోట్లు ఖర్చు చేసిందని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. మండల కేంద్రంలో నిర్మించిన 2 వేల మెట్రిక్ టన్నుల గోదాం, డీసీసీ బ్యాంక్ ధర్మసాగర్ బ్రాంచ్ నూతన భవనం, కామన్ సర్వీస్ సెంటర్‌ను అపెక్స్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావుతో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ, ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతు శ్రేయస్సు కోసం కృషి చేస్తోందన్నారు. ఏడాదిలోనే 25లక్షల మంది రైతులకు 21వేల కోట్ల పంట రుణాలను మాఫీ చేసినట్లు చెప్పారు. రేషన్ షాపుల ద్వారా ఉచితంగా సన్న బియ్యం పంపిణీ చేస్తున్న ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ అన్నారు. సన్నాలు పండించే రైతులకు రూ. 500 బోనస్ అందిస్తున్నామని, రైతు భరోసా ద్వారా ఇప్పటి వరకు 40లక్షల మంది రైతులకు 4వేల కోట్లు బ్యాంక్ ఖాతాల్లో జమ చేసినట్లు చెప్పారు. స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గాన్ని రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. హనుమకొండ డీసీఓ సంజీవరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రాజేశ్వరెడ్డి, వరంగల్ డీసీసీబీ బ్యాంక్ సీఈఓ వజీర్ సుల్తా న్, తహసీల్దార్ సదానందం, ఎంపీడీఓ అనిల్, పీఏ సీఎస్ వైస్ చైర్మన్ కుమారస్వామి పాల్గొన్నారు.

పీఏసీఎస్ ఎదుట రైతుల ఆందోళన

- పురుగులమందు డబ్బాతో హల్‌చల్



పీఏసీఎస్ ఎదుట ఆందోళన చేస్తున్న రైతులకు నచ్చచెబుతున్న పోలీసులు

శాయంపేట : మండల కేంద్రంలోని పీఏసీఎస్ సహకార సంఘంలో రైతులను మోసం చేస్తున్న ఇన్‌చార్జ్ సీఈఓ పెరుగు శంకర్‌పై చర్య తీసుకోవాలని రైతులు సొసైటీ ఎదుట పురుగుమందు డబ్బాతో ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని రైతులను సముదాయించి న్యాయం చేస్తామని ఆందోళన విరమింపజేశారు. ఈ సందర్భంగా రైతులు కోకిల సదానందం, రేణికుంట్ల పృథ్వీరాజ్, చిట్టి సాంబయ్య తెలిపిన వివరాల ప్రకారం.. శాయంపేట పీఏసీఎస్ సహకార సంఘంలో భూమి పట్టా పాస్‌పుస్తకాలు పెట్టి రుణం తీసుకున్నామని, 2025 జనవరిలో ప్రభుత్వం రుణ మాఫీ చేయడంతో మళ్లీ రుణం కోసం పీఏసీఎస్‌ను సంప్రదించినట్లు తెలిపారు. డిసెంబర్ నుంచి జులై వరకు రూ.10వేల వడ్డీ ఉందని, చెల్లిస్తే కొత్త రుణం ఇస్తామని ఇన్‌చార్జ్ సీఈఓ శంకర్ తెలిపారని అన్నారు. దీంతో రూ. 10వేల చెల్లించామని, అయితే రసీదు ఇవ్వలేదన్నారు. మళ్లీ కొత్త రుణాలు మంజూరు చేసి పృథ్వీరాజ్ అనే రైతు నుంచి రూ. 25వేల తీసుకున్నట్లు ఆరోపించారు. కోకిల సదానందం, చిట్టి సాంబయ్యకు రుణాలు మంజూరు చేయడంతో పాటు వారు కట్టిన వడ్డీ డబ్బులు సొసైటీకి చెల్లించలేదని తెలిపారు. రైతులను మోసం చేసిన పీఏసీఎస్ ఇన్‌చార్జ్ సీఈఓ పెరుగు శంకర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య

- హెచ్‌ఎం గోపాల్‌రావు



మాట్లాడుతున్న హెచ్‌ఎం గోపాల్‌రావు

ఆత్మకూరు : ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యాబోధన లభిస్తుందని మల్కపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం గోపాల్‌రావు అన్నారు. మండలంలోని మల్కపేటలో బుధవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో పిల్లలతో కలిసి ఉపాధ్యాయులు ర్యాలీ చేపట్టారు. ప్రభుత్వ పాఠశాలలో కల్పిస్తున్న సౌకర్యాలపై విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన విద్య అందిస్తున్నామని అన్నారు. పిల్లలకు ఉచితంగా యూనిఫామ్, పుస్తకాలు, మధ్యాహ్న భోజనం అందిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కల్యాణి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడొద్దు



ఆత్మకూరు : మాట్లాడుతున్న సీఐ సంతోశ్



శాయంపేట : మాట్లాడుతున్న సీఐ రంజిత్‌రావు

- సీఐలు సంతోశ్, రంజిత్‌రావు

ఆత్మకూరు : సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ సంతోశ్ సూచించారు. మండల కేంద్రంలో బుధవారం సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల సైబర్ నేరాగాళ్ల ఆగడాలు పెట్రేగిపోతున్నాయని అన్నారు. సైబర్ నేరాలకు ముఖ్య కారణం సెల్‌ఫోన్ అని, ఎలాంటి ఓటీపీ వచ్చినా ఇతరులకు చెప్పొద్దని అన్నారు. ఓటీపీతోనే సైబర్ నేరాగాళ్లు బ్యాంక్ ఖాతాలోని డబ్బులు కొల్లగొడుతున్నారని అన్నారు. అపరిచితులు ఫోన్‌లు చేసినా, మెస్సేజ్ చేసినా స్పందించొద్దని అన్నారు. అలాగే గ్రామాల్లో మాదకద్రవ్యాల అమ్మకాలు, కొనుగోళ్లు జరిగితే పోలీస్‌లకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచించారు.

యువత వ్యసనాలకు దూరంగా ఉండాలి

శాయంపేట : యువత వ్యసనాలకు బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దని సీఐ రంజిత్‌రావు అన్నారు. మండలంలోని పెద్దకోడెపాక గ్రామంలో బుధవారం రాత్రి జాగృతి కళాజాత ఆధ్వర్యంలో సైబర్ నేరాలు, మూఢనమ్మకాలపై కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడారు. ప్రజలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని అన్నారు. యువత గుట్కా, గంజాయి, డ్రగ్స్, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. బాల్యవివాహాలు చేయవద్దని, మైనర్ బాలబాలికలతో కూలీ చేయించొద్దని అన్నారు. గ్రామాల్లో సీసీ కెమెరాలు బిగించుకుంటే నేరాల నియంత్రణ మరింత సాధ్యపడుతుందని అన్నారు. డయల్ 100పై అవగాహన కల్పించారు. ఏఎస్సై కుమారస్వామి, జాగృతి కళాబృందం ఇన్‌చార్జ్, ఏఎస్సై నాగమణి, కళాకారులు విలియమ్, వెంకటేశ్వర్లు, రత్నయ్య, శ్రీనివాస్, విక్రమ్, చిరంజీవి, పీఎస్సైలు, పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

రెండోరోజు కొనసాగిన విచారణ

కమలాపూర్ : వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణంలో జరిగిన అవినీతి, అక్రమాలపై జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు డీఆర్డీఓ కార్యాలయ అధికారులు, సిబ్బంది బుధవారం రెండోరోజు క్షేత్రస్థాయి విచారణ జరిపారు. స్థానిక గ్రామ పంచాయతీ పరిధిలో 2016 నుంచి 2019 వరకు మొత్తం 562 మందికి వ్యక్తిగత మరుగుదొడ్లు మంజూరయ్యాయని, అందులో అందరు మరుగుదొడ్ల నిర్మాణం పూర్తిచేయలేదని, కొందరికి రూ.6 వేలు మాత్రమే చెల్లించి మిగతా రూ.6 వేలు చెల్లించకుండా అప్పటి అధికారులు, ప్రజాప్రతినిధులు లబ్ధిదారుల సంతకాలు ఫోర్జరీ చేసి అవినీతికి పాల్పడినట్లు మండల కేంద్రానికి చెందిన అన్వేష్ రాష్ట్ర పంచాయతీ రాజ్‌శాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో విచారణ చేపట్టిన అధికారులు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వ్యక్తిగత మరుగుదొడ్డి మంజూరైందా? మంజూరైతే మరుగుదొడ్డి నిర్మించుకున్నారా? నిర్మించుకుంటే డబ్బులు వచ్చాయా? వస్తే ఎన్ని డబ్బులు ముట్టాయి అనే విషయాలను అడిగితెలుసుకున్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ

మామునూరు: ఖిలా వరంగల్ మండలం 43వ డివిజన్ మామునూరులో ఇందిరమ్మ ఇళ్లకు బుధవారం భూమిపూజ జరిగింది. స్థానిక కార్పొరేటర్ ఈదురు అరుణవిక్టర్, ఏఈ పావని, స్పెషల్ ఆఫీసర్ ఎం.డీ.ఫూర్ ఖాజై ఇళ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. నాయకులు ఉన్నారు.